క్లుప్తంగా

అందరినీ బడిలో చేర్పించాలి



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గుడిబండ: బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలనే లక్ష్యంతో విద్యాశాఖ 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టింది. ఈ నెల 13నుంచి కార్యక్రమం సాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం గుడిబండ మండల కేంద్రంలో పలు పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థిని, విద్యార్థులతో ప్లే కార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందప్ప మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ పాఠశాలలో చేర్పించాలన్నారు. ర్యాలీలో అందరు చదవాలి, అందరూ ఎదగాలి, బడి మనది.. బాధ్యత మనది అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపర్చండి

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి, అమరాపురం గ్రామ పంచాయతీలను జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీల్లోని రికార్డులను పరిశీలించారు. డీపీఓ మాట్లాడుతూ వానా కాలం కావడంతో నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, అందువల్ల పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పన్నుల వసూలు, పెండింగ్ బిల్లులు తదితర వాటిని ఆరా తీశారు. ఆయన వెంట ఈఓఆర్డీ నాగముని, కార్యదర్శులు భాస్కర్, మనోహర్‌శర్మ ఉన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రె, మేక మృతి



రొళ్ల: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేలాడుతున్న విద్యుత్ వైర్ నుంచి విద్యుత్ సరఫరా కావడంతో గొర్రె , మేక మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే రొళ్లగొల్లహట్టికి చెందిన కాపరి పూజారి రామప్ప గొర్రెలు, మేకలను పెంచి జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం జీవాలను మేత కోసం రొళ్ల పట్టణ సమీపంలోని పాల శీతల కేంద్రం వద్దకు తీసుకెళ్లాడు. అయితే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అర్తింగ్ కోసం ఏర్పాటు చేసిన వైర్ కింది భాగం వరకూ తెగిపోయింది. వైర్ల దగ్గరకు గొర్రె , మేక వెళ్లడంతో విద్యుదాఘాతంతో చనిపోయాయి. రూ.35 వేల నష్టం వచ్చిందని విద్యుత్‌శాఖ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రామప్ప విజ్ఞప్తి చేశాడు.

కేంద్ర విద్యాశాఖామంత్రి రాజీనామా చేయాలి

మడకశిర: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నీట్ పరీక్షను రద్దు చేయాలన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని కూడా రద్దు చేసి ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేయించాలని కోరారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ అయినట్లు తెలిసినా కేంద్ర ప్రభుత్వం ఎందుకు పరీక్షను రద్దు చేయడం లేదని ప్రశ్నించారు.

ఆడిట్ పక్కాగా నిర్వహించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ మునిస్వామి

అమరాపురం: మండలంలో ఉపాధి హామీ పథకం కింద 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకూ నిర్వహించిన ఉపాధి పనుల ఆడిట్‌ను పక్కాగా నిర్వహించాలని ఎస్ఆర్‌పీ చంద్రమోహన్, ఎంపీడీఓ మునిస్వామి కోరారు. శుక్రవారం వీఎస్ఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులు సక్రమంగా జరిగాయా? లేదా? అని ఫీల్డ్ లెవెల్‌లో తనిఖీ చేసి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఇందుకోసం డీఆర్పీలు, సహాయ సహకారాలు తీసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పావగడ: తాలూకాలోని 66-11 కేవీ పావగడ, వెంకటాపురం, శైలాపురం, నాగలమడక, మంగళవాడ, కిలార్లహళ్లి, లింగదహళ్లి, వైఎన్ హొసకోటతో పాటు 220-66-11 కేవీ పావగడ ఉప కేంద్రాలలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. త్రైమాసిక నిర్వహణ కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కోర్టులు, పాఠశాలలు, కార్యాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. యోగా సాధనతో కలిగే ఉపయోగాలను యోగా గురువులు తెలియజేశారు. ప్రపంచ దేశాలన్నింటికీ యోగాను పరిచయం చేసిన ఘనత మన దేశానికే దక్కిందని వక్తలు తెలిపారు. యోగాతో మానసిక ఉల్లాసంతో పాటూ ఏకాగ్రత సమకూరుతుందన్నారు. అనారోగ్య సమస్యలు సైతం నయమవుతాయని పేర్కొన్నారు.

– సాక్షిబృందం

- హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో ఘనంగా యోగా దినోత్సవం
- ఆసనాలను సాధన చేసిన విద్యార్థులు, ఉద్యోగులు
- ప్రతి ఒక్కరూ యోగా చేయాలని వక్తల పిలుపు



చిలమత్తూరు: రక్షా అకాడమీలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, సిబ్బంది



పావగడలోని యోగా మందిరంలో కూర్మాసనం వేస్తున్న దృశ్యం



అమరాపురం ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు



లేపాక్షి మండలం శిరివరం పాఠశాలలో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

యోగాతో ఒత్తిడి దూరం

- జిల్లా అదనపు జడ్జి శైలజ



హిందూపురం: యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు, కోర్టు ఉద్యోగులు

హిందూపురం అర్బన్: ప్రతి మనిషి నిత్య జీవితంలో యోగా ఒక అలవాటుగా మారాలని జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ , సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ సూచించారు. శుక్రవారం యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కోర్టు ఆవరణంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ యోగాతో ఒత్తిడిని దూరం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.



మడకశిర ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు



గుడిబండ: జెడ్పీ హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



హిందూపురం మండలం కొట్నూరులో విద్యార్థుల ర్యాలీ

యోగాతో ఆరోగ్యం భద్రం

పెనుకొండ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు ఎస్. వెంకటేశులు పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని న్యాయసేవా అధికార సంస్థ మండల అధ్యక్షుడు వాసుదేవన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బొజ్జప్ప, జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ సయ్యద్ పసపల న్యాయవాదులు పాల్గొన్నారు.



పెనుకొండ కోర్టు ఆవరణలో యోగా చేస్తున్న న్యాయమూర్తులు, సిబ్బంది



రొద్దంలో స్థానికులకు యోగాసనాలు నేర్పుతున్న వైద్యసిబ్బంది



రొళ్ల మండలం రత్నగిరి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈఓ శ్రీధర్

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

రొద్దం: గత ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఎంపీపీ చంద్రశేఖర్‌ను శుక్రవారం మాజీ మంత్రి, తాజా మాజీ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కంట తడి పెట్టుకోగా.. శంకరనారాయణ ఓదార్చారు. అధైర్య పడొద్దని వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుదని ధైర్యం చెప్పారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, పెనుకొండ మున్సిపాల్ చైర్మన్ ఉమార్‌ఫరూఖ్, కౌన్సిలర్ రామాంజి, వైస్ ఎంపీపీ రామాంజినమ్మ, నాయకులు బి.నారాయణరెడ్డి, ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, ఉజ్జినప్ప, అంజినరెడ్డి, ఫరీద్, సూరి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ చంద్రశేఖర్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి శంకరనారాయణ

కేటీ హళ్లిలో దొంగతనం

పావగడ: తాలూకాలోని అరసికెరె పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేటీ హళ్లికి చెందిన రైతు నాగరాజు తోటలో గురువారం రాత్రి దొంగతనం జరిగింది. తోటలో నిర్మించుకున్న ఇంటి తలుపులకు వేసిన తాళం పగుల గొట్టి ఇంట్లో ఉంచి ట్రిల్లర్, మోటార్, పిచికారీ యంత్రాలు, స్టాటర్లు, స్టాండ్ ఫ్యాన్ తదితర వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధిత రైతు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టండి

రొళ్ల: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈఓఆర్డీ కృష్ణప్ప తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

'నేను బడికి పోతా' ర్యాలీ

సోమందేపల్లి: తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పనులకు పంపకుండా బడులకు పంపాలని ఎంఈఓ– 2 మోహన్ బాబు కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన సోమందేపల్లిలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. బడి బయట పిల్లలను గుర్తించి కచ్చితంగా వారికి కౌన్సిలింగ్ ఇచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విద్యాశాఖ సిబ్బందికి ఆయన సూచించారు.

మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టువస్త్రాలు వెండి, బంగారు ఆభరణాలు, గాజులతో పాటు వడిబియ్యం కట్టి పూలతో అలంకరణ చేసి మహామంగళారతి ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పరిగి: గర్భిణులు, బాలింతలతో పాటూ చిన్నారులు, వృద్ధులకు ఆహార నియమాల విషయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని పరిగి ప్రాథమిక ఆరోగ కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రూబీ తెలిపారు. ప్రధానంగా పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం గర్భిణులకు మధ్యాహ్న భోజనాన్ని స్థానిక దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు తరపున చైర్మన్ పరిగి వేణుగోపాలరావు సమకూర్చారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

గుడిబండ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత. ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని సర్పంచ్ కరుణాకర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని ఫళారం క్రాస్ నుంచి మోపురుగుండు వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మందలపల్లి సర్పంచ్ అశ్వత్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

25న పశువుల సంత వేలం

గుడిబండ: మండల కేంద్రంలో వారపు పశువుల సంత వేలం పాట నిర్వహిస్తునట్లు పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ తెలిపారు. పశువుల సంతకు డిపాజిట్‌గా రూ.5 లక్షలు, కూరగాయల సంతకు రూ. లక్ష , దినసరి బస్టాండుకు రూ. 50 వేలు, 5 షాపింగ్ కాంప్లెక్స్‌లకు రూ.6,500, రెండు తాగునీటి శుద్ధి కేంద్రాలకు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

ఖాళీ స్థలాల్లో వ్యాపారాలకు టెండర్ల ఆహ్వానం

పెనుకొండ: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఖాళీ స్థలాల్లో వ్యాపారాలు నిర్వహించడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ టీఐ రామాంజినేయులు తెలిపారు. టెండర్ పార్మ్‌లు డిపో మేనేజర్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తులు తీసుకుని 27వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోపు జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఉంచిన బాక్సులో వేయాలన్నారు. అదే రోజు టెండర్లు తెరిచి అటాచ్ మెంట్ ఇస్తామన్నారు.

అంగన్‌వాడీల్లో గ్రాడ్యుయేషన్ డే

చిలమత్తూరు: మండలంలోని కోడూరు పంచాయతీ సుబ్బరావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ రెడ్డిరమణమ్మ, సూపర్‌వైజర్ సునీతాబాయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నర్సరీ పూర్తి చేసుకొని ఐదు సంవత్సరాలు పైబడిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలకు చేర్పించేందుకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఉదయం ఐసీడీఎస్ సీడీపీఓ రెడ్డిరమణమ్మ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 సంవత్సరాలు చదువుకుని 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పిల్లలకు డిగ్రీ పట్టా తరహాలో ఇచ్చి గౌరవించారు. అనంతరం అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాయినాథ్, సూపర్‌వైజర్ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



సుబ్బరావుపేటలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించిన దృశ్యం

'పురం'లో ఏరువాక పౌర్ణమి

హిందూపురం: హిందూపురంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు ఏరువాక పూర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య పిలుపు మేరకు శుక్రవారం హిందూపురంలోని కొట్నూరులో ఏరువాక పౌర్ణమిని రైతులు ఘనంగా జరుపుకున్నారు. కొట్నూరు గ్రామ పొలాల్లో మడకలు దున్ని ఏరువాకను ప్రారంభించారు. బ్యాంకులలో ఉన్న రుణాలను పూర్తిగా మాఫీ చేసి డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేసి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



దుక్కి దున్నుతున్న రైతులు, రైతు సంఘం నాయకులు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జయప్రసాద్‌రెడ్డి

హిందూపురం: గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ (13/2020) రాష్ట్ర కమిటీలో హిందూపురం సచివాలయ సెక్రటరీలకు అవకాశం కల్పించినట్లు కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు భీమిరెడ్డి అంజనరెడ్డి తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హిందూపురంలో సచివాలయ వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీగా పనిచేస్తున్న బి.జయప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మరూరు గ్రామ సచివాలయంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న హర్షవర్ధన్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా హిందూపురంలో అడ్మిన్ సెక్రటరీగా పనిచేస్తున్న టి.చంద్రశేఖర్‌లను నియమించినట్లు చెప్పారు. నూతన సభ్యులు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేసి అసోసియేషన్‌కు మంచి పేరు తీసుకురావాలన్నారు.



కమిటీ రాష్ట్ర అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జయప్రసాద్‌రెడ్డి

సస్యరక్షణతో అధిక దిగుబడి

పరిగి: వ్యవసాయంలో రైతులు సస్యరక్షణ పద్ధతులను పాటించడం వల్ల అధిక దిగుబడితో మంచి లాభాలు గడించవచ్చని జిల్లా జలవనరుల కేంద్రం వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు సనావుల్లా తెలిపారు. మండలంలోని ఎర్రగుంట రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు పంటసాగులో వినియోగించుకోవాలన్నారు. వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయంగా కంది, ఆముదపు పంటలను విరివిగా సాగు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ అబ్దుల్ ఆలీ, ఏఓ విజయభారతి, ఏఈఓలు లలిత, పావని తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: రాగి పంట విస్తీర్ణాన్ని పెంచడానికి కృషి చేయాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సనావుల్లా తెలిపారు. శుక్రవారం మడకశిరలో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, రైతులకు పలు అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వేరుశనగ, కంది, మొక్కజొన్న, రాగి, పత్తి పంటలపై అవగాహన కల్పించారు. పంటల సాగులో యాజయాన్య పద్ధతులను ఆయన వివరించారు. ఎరువుల వాడకం, తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. సదస్సులో ఏఓ తిమ్మప్ప, జిల్లా వనరుల కేంద్రం అధికారి అబ్దుల్‌అలీ, ఏఈఓ కౌసర్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ సనావుల్లా

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతి

లేపాక్షి: మండల కేంద్రంలోని సర్వేనంబరు 358, 361లలో సీపీఐ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్ బాల నరసింహులుకు సీపీఐ నాయకులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నామని, వెంటనే పట్టాలివ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివప్ప, నారాయణరెడ్డి, గౌతంకుమార్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మడకశిర: పట్టణ సమీపంలోని మడకశిర – పావగడ రోడ్డులో ప్రమాదం తృటిలో తప్పింది. పావగడ నుంచి మడకశిరకు వస్తున్న లారీ అదుపు తప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. డ్రైవర్, క్లీనర్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డారు.

ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా మహేష్

మడకశిర: పట్టణంలోని ఒకేషనల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మహేష్ నియమితులయ్యారు. ఇంతకు మునుపు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పని చేసిన రామకృష్ణప్ప పదవీ విరమణ చేశారు. దీంతో ఇంగ్లిష్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న మహేష్‌ను ప్రిన్సిపాల్‌గా నియమించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9705346587
9010200238, 9912220726